# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :268 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 06-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## మెదక్ జిల్లాలో దారుణ ఘటన...

మెదక్, మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్ లో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది భార్య.. మద్యం మత్తులో భర్త స్వామి (35) చెరువులో పడి చనిపోయినట్టుగా నమ్మించేందుకు ప్రయత్నం చేసింది. ఇక, పోలీసుల విచారణలో భార్య మౌనిక(28) అక్రమ సంబంధం బాగోతం బయటపడింది. అయితే, 12 ఏళ్ల క్రితం స్వామి, మౌనికలకు పెళ్లి జరగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక, తనకంటే తక్కువ వయస్సున్న సంపత్(23) అనే యువకుడితో ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలియడంతో పంచాయితీ పెడతానని భర్త హెచ్చరించాడు. దీంతో ఎలాగైనా భర్తను చంపేయాలని మౌనిక ఎ÷-లాన్ వేసింది. గత నెల డిసెంబర్ 22వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి నిద్రపోయిన స్వామి.. ఇదే అదనుగా భావించి ప్రియుడిని ఇంటికి పిలిచి ఇద్దరు కలిసి భర్త గొంతు నొక్కి చంపేశారు. ఇక, భర్త స్వామి చనిపోయిన తర్వాత బైక్ పై మృతదేహాన్ని తీసుకెళ్లి నెరేళ్లకుంటలో పడేసి మద్యం మత్తులో పడి చనిపోయినట్టు కిలేడి మౌనిక నమ్మించింది. అయితే, భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో తమ స్టైల్లో పోలీసులు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుకు ఊరట..



హైదరాబాద్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ చక్రధర్ గౌడ్ సుప్రీంకోర్టుకు వెళ్లగా జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. కాగా, చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

## మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు...

వాషింగ్టన్,జనవరి5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తున్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు. మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలెటరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై



టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷-లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

## ట్రంప్ బెదిరింపులతో వెనక్కి తగ్గిన వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు..



వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెనక్కి తగ్గారు. తమ దేశంతో కలిసి పనిచేయాలని, తమకు సహకరించాలని అమెరికాకు పిలుపునిచ్చారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించి తీసుల్లిన సమయంలో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె.. ఇప్పుడు అమెరికా ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడం గమనార్హం.అంతర్జాతీయ చట్టాల పరిధిలో, పరస్పర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని అమెరికా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నామని రోడ్రిగ్జ్ ప్రకటించారు. దీర్ఘకాలిక సంబంధాన్ని బలోపేతం చేసే ఎజెండాతో తన ప్రతిపాదనను ముందుకు తీసుళ్లాలని కోరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి రోడ్రిగ్జ్ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే మదురోను అమెరికా బలగాలు పట్టుళ్లినప్పుడు మాత్రం ఆ చర్యను రోడ్రిగ్జో తీవ్రంగా వ్యతిరేకించారు. మదురోను వెంటనే వెనక్కి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశానికి ఒకరే అధ్యక్షులుగా ఉన్నారు.. ఆయనే మదురో అని పేర్కొన్నారు.అయితే, రోడ్రిగ్జో తాత్కాలిక ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ఆమెను తీవ్రంగా హెచ్చరించారు. అమెరికాను ఎదిరిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.. ఆమె సరైన నిర్ణయాలు తీసుకోకపోతే.. మదురో కంటే పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రోడ్రిగ్జో వెనక్కి తగ్గి.. అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించడం గమనార్హం.

## కవిత రాజీనామాపై పునరాలోచించండి...

హైదరాబాద్,శాసనమండలిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామా ప్రకటన రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ..కవితకు కీలక సూచనలు చేశారు.

భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం సరికాదు

మండలిలో ప్రసంగిస్తూ కవిత కంటతడి పెట్టుకోవడం, ఆ వెంటనే రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించడంపై గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందించారు. భావోద్వేగాల మధ్య రాజీనామా చేయడం సరైంది కాదు. రాజకీయాల్లో ఒడిదుడుకులు, ఆంక్షలు సహజం. అంతమాత్రాన రాజీనామా వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదుc అని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజీనామాపై పునరాలోచన చేయాలి

కవిత తన నిర్ణయంపై మరొకసారి ఆలోచించుకోవాలని చైర్మన్ సూచించారు. రాజీనామా అంశంలో కవిత గారు పునరాలోచన చేయాలి. ప్రజా సమస్యలపై గళం విప్పడానికి సభ ఒక వేదిక. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతున్నానుc అని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే, కవిత తన



రాజీనామాను ఆమోదించాలని పట్టుబడుతుండటంతో చైర్మన్ తదుపరి చర్యలు ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

## కేటీఆర్ నియోజకవర్గం....మార్పు కోరుకుంటున్నారా..

హైదరాబాద్, జనవరి 5,తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ పరిపాలించారు. రెండు పర్యాయాలు కూడా నాటి ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ కీలక శాఖలను పర్యవేక్షించారు. కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉద్యమం జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఆయన కొనసాగుతున్నారు.సిరిసిల్ల ప్రాంతంలో కేటీఆర్ కు బలమైన క్యాడర్ ఉంది. ఇక్కడ చేనేత కార్మికులకు ఆయన అనేక విధాలుగా ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో లేదు. భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగుతున్నప్పటికీ.. ఫార్ములా ఈ కార్ రేసు లో ఆయన తీవ్రస్థాయిలో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఆయనను ఏసీబీ విచారించింది.2023 నుంచి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అనుకూల ఫలితాలను సాధించలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలను సాధించింది. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలను కూడా సాధించలేకపోయింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోయింది. ఇన్ని ఓటముల సమయంలో భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగారు.కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడి హోదాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పర్యాయాలు పర్యటించారు. గతంలో సిరిసిల్ల మీద కేటీఆర్ అంత సీరియస్ గా దృష్టి పెట్టేవారు కాదు. అయితే ఇప్పుడు కేటీఆర్ సిరిసిల్ల మీద ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వారం వారం నియోజకవర్గానికి వెళ్తున్నారు. గతంలో కేటీఆర్ నెలకు ఒకసారి సిరిసిల్లకు వస్తే గొప్పగానే ఉండేది. అయితే ఇప్పుడు పూర్తిగా మారిపోయింది.గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించానని చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు సిరిసిల్లలో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇటీవల స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఒక్కసారిగా ఆత్మ రక్షణలో పడిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.నియోజకవర్గం



లో భారత రాష్ట్ర సమితి నల్లేరు మీద నడక మాదిరిగా గెలవలేదు. అధికార పక్షానికి పోటీ మాత్రమే ఇవ్వగలిగింది. అయితే ఈ ఫలితాలు కేటీఆర్ ను ఇబ్బందికి గురి చేశాయని వార్తలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్ల నియోజకవర్గం లో కేటీఆర్ కు అనుకూలంగా అన్ని జరిగిపోయాయి. ఇప్పుడు పరిస్థితి మాత్రం అలా లేదు. కార్యకర్తలు ఇతర పార్టీలవైపు వెళ్ళడానికి ఆసక్తిగా ఉన్నారు. ఈ వలసలను అడ్డుకోవడానికి.. నాయకత్వంలో భరోసా నింపడానికి కేటీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని.. అందువల్లే ప్రజలలో ఉండాలని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది.అధికారం ఉన్నప్పుడు కేటీఆర్ అభివృద్ధి పై దృష్టిపెట్టారని.. అప్పట్లో ఆయన నాయకత్వం మధ్య సమన్వయం సాధించడంలో దృష్టి పెట్టలేదని.. అందువల్లే సిరిసిల్లలో గులాబీ పార్టీ నాయకుల మధ్య విభేదాలు పెరిగాయని ప్రచారంలో ఉంది. అందువల్ల కేటీఆర్ ప్రజల్లో ఉంటున్నారు. వారి మధ్య ఉన్న గ్యాప్ ను పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. రచ్చబండ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల ను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.సిరిసిల్ల అనేది తెలంగాణ రాష్ట్రంలో ఒక నియోజకవర్గం మాత్రమే కాదు. కేటీఆర్ కు బలమైన రాజకీయ కోట. ఆ కోట ఎప్పటికీ బలంగానే ఉండాలి. అలా కాకుండా పగుళు ఏర్పడితే ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంటుంది. భవిష్యత్ కాలంలో కేటీఆర్ నాయకత్వాన్ని ఆ పరిణామం ఇబ్బందికి గురిచేస్తుంది. అందువల్ల ఈ నష్టాన్ని పూడ్చడానికి కేటీఆర్ ఏకంగా నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతున్నారు .

## వేములవాడలో ప్రారంభమైన శివ దీక్షలు.. 35 సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజన్న దీక్షలు



వేములవాడ, జనవరి 5 : రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిఆలయంలో శివ దీక్షలు ప్రారంభమయ్యాయి. శివ స్వాముల ఓం నమశ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శివ భక్తులు శివుడి మాలధారణ స్వీకరించారు.నుదుటన, విభూతి కుంకుమ ధరించిన శివ స్వాములకు అర్చకులు రుద్రాక్ష శివ మాల ధారణను గావించగా ప్రతీ యేటా శివరాత్రికి 41 రోజుల ముందు శివుని మాలధారణ చేసి, వచ్చే నెల 15న మహాశివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో మాల విరమణ చేస్తారు.దాదాపు 35 సంవత్సరాల నుండి ప్రతియేటా రాజన్న దీక్షలు మాల ఆనవాయితీగా వస్తోంది. మానవుడు భగవత్ దీక్ష కలిగియుంటే అరిష్టాలు తొలిగి, సిరి సంపదలు, సుఖ సంతోషాలు కల్గుతాయని భక్తుల విశ్వాసం. దీక్షల్లో అత్యుత్తమైనది శివ దీక్ష, లయకారుడైనా శివుడిని రూపం ధరిస్తే మోక్షం కల్గుతుందని భక్తుల నమ్మకం. అందుకే శుభకరుడైన మహాశివుడిని భక్తులు కొలుస్తారు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శ్రీశైలంలో మొదలైన శివదీక్షలు, దక్షణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ వరకు విస్తరించాయి. ప్రతీ రోజు సూర్యోదయం, మధ్యాహ్నం, సాయంత్రం కఠిన నియామాలతో శివుడిని పూజిస్తూ, కఠిక నేలపై నిద్రిస్తారు.వీటిలో శివ దీక్షలు మహామండలం 108 రోజు, మండల దీక్ష 41 రోజులు, అర్ధమండల దీక్ష 21 రోజులు ధరిస్తారు. శివమాల ధరించే స్వాములు తప్పని సరిగా శివుడికి అభిషేకం చేసిన తర్వాతనే లింగం ధరించిన స్వాములు మాలలు వేస్తారు. చందన వర్ణం వస్త్రాలను ధరించి, నుదుట విభూతి, కుంకుమ చందనం, మెడలో రుద్రక్షమాల ధరిస్తారు. దీక్ష సమయంలో మంచి నియమాలు పాటిస్తే సంపూర్ణ ఫలితం లభిస్తుందని అర్చకులు వెల్లడిస్తుండగా దీక్ష దీక్షకరించిన స్వాములు ఆచరిస్తున్నారు.

## తెలంగాణకు అడ్డు చెప్పలేదు, విద్వేషాలు కాదు - చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..!!

హైదరాబాద్,ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు. రాయలసీమ లిఫ్ట్ పై తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. దీని పైన ఏపీ మంత్రి రామానాయుడు స్పష్టత ఇచ్చారు.కాగా, సీఎం చంద్రబాబు సైతం ఇదే సమయంలో కీలక వ్యాఖ్యలు చేసారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని చెప్పారు. కాళేశ్వరం కట్టే సమయం లో అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేసారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు మహాసభలో కీలక ప్రసంగం చేసారు. దేశంలో జాతీయ భావన పెరగాలని వ్యాఖ్యానించారు. ఒకరి భాషను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు. మాతృభాష అమ్మతో సమానమని పేర్కొన్నారు. మాతృ భాషలో చదువుకున్న వారు ప్రపంచంలో ఏమైనా చేయగలరని చెప్పుకొచ్చారు. సంక్రాంతి కంటే ముందు వచ్చిన అమ్మభాష పండుగ ఇదని తెలిపారు. దేశంలో అనేక భాషలు ఉన్నా.. ఆరు భాషలకు మాత్రమే ప్రాచీన హోదా ఉందని వెల్లడించారు. ఇలాంటి సభలు తెలుగు భాష గొప్పతనాన్ని చాటేందుకు ఉపయోగపడతాయని వివరించారు.భాషాప్రయుక్త రాష్ట్రాలు రావాలని పోరాడిన వ్యక్తి మహనీయుడు పొట్టి శ్రీరాములును మరవలేమని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు కలవాలని పోరాడిన బూర్గుల రామకృష్ణారావు త్యాగం మరవలేమని చెప్పుకొచ్చారు. వారసులుగా భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మన ప్రాస, యాస, సందులు, సమాసాలు చాలా ప్రత్యేకమైనవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.మాతృభాష మన మూలాలకు సంకేతంగా చంద్రబాబు అభివర్ణించారు. టెక్నాలజీతో భాష కనుమరుగవుతుందని అన్నారని.. కానీ టెక్నాలజీతో భాషను సులువుగా కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో తన హయాంలో.. తెలంగాణలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినప్పుడు అడ్డుపడలేదని వెల్లడించారు.తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు.. సమైక్యత అవసరమని చంద్రబాబు వివరించారు. నీటి విషయంతో పాటు ఇతర అంశాల్లో తెలుగువారు



కలిసే ఉండాలి. గంగా-కావేరి కలవాలి.. దేశంలో నీటి సమస్య పూర్తిగా తీరాలి.. అదే తన కోరికని స్పష్టం చేసారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కావాలన్నారు. గోదావరి నీటిని తెలంగాణ వాడుకుంటే ఎప్పుడూ అడ్డుచెప్పలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

### గంజాయి కేసుల్లో దొరికితే కఠిన శిక్షలు

శ్రీకాకుళం, గంజాయి కేసుల్లో దొరికితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. చిన్న చిన్న సరదాలకు పిల్లల జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. శనివారం శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. 501 గ్రామాలు, సుమారు 1300 కిలోమీటర్ల మేర పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయ సైకిల్ యాత్ర జరిగిందని తెలిపారు. ఇటీవల ఇండిగో సంక్షోభాన్ని హ్యాండిల్ చేయలేదని రామ్మోహన్ నాయుడుపై ఆరోపణలు వచ్చాయని ప్రస్తావించారు. కానీ వారం రోజుల్లో ఆయన పరిస్థితిని పరిష్కరించారని చెప్పుకొచ్చారు. ఆ వారం రోజులు ఆయన పడిన కష్టం తనకు తెలుసునని అన్నారు.

సంపాదకీయం

మంగళవారం 06-01-2026

# విప్లవాత్మక నిర్ణయాలకు ఇదే సమయం !

క్యాలెండర్లు మారుతూ ఉంటాయి. అయితే ప్రజల జీవితాలు ఏ మేరకు మారాయి..ఎంతమేరకు మనం చేసిన పాలన ప్రజల ఇతోధిక అభివృద్ధికి దోహదపడిందో అన్నది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఏటేటా ప్రజల జీవనం ఛిద్రం అవుతున్నా, సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వల్ల దేశం నానాటికీ దిగజారి పోతోంది. అన్ని రంగాలు కుదేలవుతున్నాయి. ప్రధానంగా విద్య,వైద్యరంగాల్లో మెరుగైన పనితీరు ఏవీ కానరావడం లేదు. ఇదంతా కేవలం పాలకులు లోపభూయిష్ట నిర్ణయాల కారణంగానే చూడాలి. ప్రభుత్వాలు వస్తున్న ఆదాయాలను అభివృద్ధి వైపు కాకుండా ఓటు బ్యాంక్‌కు ఉపయోగపడే పథకాలకు మళ్లించడం వల్ల అప్పుల్లో కూరుకుపోతున్నారు. దేశం యావత్తు ఇదే పరిస్థితి ఉంది. సంక్షేమం పేరుతో చేస్తున్న విన్యాసాల కారణంగా పురోగమనం తగ్గింది. కనీసం రోడ్లు వేయలేని దురవస్థలు చూస్తున్నాం.తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకానీ, ఉపాధి కల్పన కానీ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగాలేవు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం పెరగడం లేదు. మరోవైపు పరిశ్రమల పేరు చెప్పి, కార్పోరేట్లకు భూ సంతర్పణ కొనసాగుతోంది. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రభుత్వ వైద్య రంగాన్ని కార్పోరేట్లకు అప్పచెప్పడానికి పాలకులు పరుగులు తీస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలు ఆగలేదు. 2025లో జరిగిని తీరును చూస్తూ 2026లో ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోవడానికి లేదు. నూతన సంవత్సరం 2026లోకి అడుగుపెట్టాం. గత కాలపు అనుభవాలు పాఠాలుగా మార్చుకోవడానికి, గుణపాఠాలు నేర్చుకుని ముందుకు అడుగు వేయడానికి ఇది సరైన సమయం! 2025వ సంవత్సరం మన ముందుంచిన కఠోర వాస్తవాలు నూతన సంవత్సరానికి స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తున్నాయి. అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరడం, నిరుద్యోగం తీవ్రమవ్వడం, కార్పొరేట్ దురాశలతో ప్రజల జీవనాధారాలు కుదేలవడం, పాలకులు రాజకీయాలు కార్పొరేట్ల లాభాల ఆశలతో జత కలవడం ఇవన్నీ గత ఏడాది సాధారణ ప్రజల జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసిన అంశాలు. దేశ సంపదలో నలభై శాతం కేవలం ఒక్క శాతం మంది వద్ద కేంద్రీకృత మవ్వడం, మరోవైపు కోట్లాది మంది కూడు,గూడు,గుడ్డ,విద్య-వైద్యం వంటి మౌలిక అవసరాలు కూడా తీరని దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు దానికి భిన్నంగా తమ పాలన సాగిస్తున్నారు. విద్య, ఉపాధి రంగాలు అత్యంత దయనీయ స్థితికి చేరాయి. ఇప్పటివరకు అంతో, ఇంతో విశ్వాసం పొందిన న్యాయ వ్యవస్థ గత కాలపు ఖ్యాతి మసకబారుతుండటం ఆందోళనకర పరిణామం. నూతన విద్యావిధానం పేరుతో మూతబడిన బడులు మళ్లీ తెరుచుకోవాలని, చరిత్ర, విజ్ఞానశాస్త్రాలను పెంపొందించాలని, విద్యారంగం శాస్త్రీయ భావనలతో కొత్త పుంతలు తొక్కాలని, వేయి ఆలోచనలు వికసించి భావి తరాల ప్రగతికి బాటలు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల జీవనోపాధికి గ్యారంటీ ఇచ్చే ఉద్యోగ, ఉపాధి రంగాలు కొత్త సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో విరాజిల్లాలన్నది ప్రజల ఆకాంక్ష! గణాంకాల మాయాజాలం కాకుండా, తమ గౌరవాన్ని కాపాడే నిజమైన అభివృద్ధి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆర్థిక సంస్కరణలతో ఇప్పటికే అరకొరగా మారిన కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌లతో పూర్తిగా దిగమింగడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఏపి రాజధాని అమరావతి నగర నిర్మాణం ఇంకా భూమి చుట్టే తిరుగుతోంది. రెండేళ్లు కావస్తున్నా ఉన్న భూమితో సరిపెట్టకోకుండా రియల్ వ్యాపారం వైపు చంద్రబాబు పరుగులు తీస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం వంటివి జవాబులేని ప్రశ్నలుగానే మిగిలాయి. ఈ వైఫల్యాలను ప్రశ్నించి, ప్రజలకు న్యాయం కోసం గళమెత్తే శక్తుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం బరితెగించడం చూస్తున్నాం. ఇకపోతే దేశంలో దళితులు, ఆదివాసులు, మహిళలు ఎదుర్కొంటున్న దాడులకు ముగింపు పలికి, సమానత్వం నిజంగా అమలుకావాలన్నది ప్రజల ఆకాంక్ష. జల్, జంగల్, జమీన్‌పై కార్పొరేట్ ఆక్రమణలు ఆగాలి. అటవీ భూముల రక్షణ, గిరిజనుల హక్కుల పరిరక్షణ జరగాలి. పట్టణాల్లో కాలుష్యం, కొండల విధ్వంసం, ప్రకృతి వనరుల దోపిడీ వంటివి కేవలం పర్యావరణ సమస్యలు కావు. ఇవి జీవన, సామాజిక న్యాయ సమస్యలు. సామాన్యులను పట్టం కట్టే పర్యావరణ న్యాయంవైపు దేశం మళ్లాల్సింది. దేశ ఎన్నికల ప్రక్రియ నూతన ఏడాదిలోనైనా నిజమైన, నిష్పక్షపాతపు ప్రజాస్వామ్యంగా మార్చాలి. దొంగ ఓట్లను, చోరబాటుదారుల ఓట్లను తొలగించాల్సిందే. అలాగే ఉచిత పథకాలను తగ్గించి, అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. అదేవిధంగా లెక్కకు మించి పెన్షన్లు, తెల్ల రేషన్ కార్డులను తొలగించాలి. కొత్త సంవత్సరం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆశావహ మలుపు తీసుకునేలా కార్యాక్రమాలను విస్తరించాలి. కేవలం పేదలకు మాత్రమే నేరుగా పథకాలు అందించాలి. దుబారా పథకాలను తగ్గించాలి. అప్పుడే దేశం బాగుపడగలదు.

# బిఆర్ఎస్ హయాంలో ఏపి కృష్ణాజలాల జలదోపిడీ



హైదరాబాద్,బిఆర్ఎస్ హయాంలోనే ఎపి నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని ఉత్తమ్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉనన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు.

# ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 64?



హైదరాబాద్, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు మరో మూడు సంవత్సరాలు పెంచాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర?యం తీసుకున్నదని సచివాలయంలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో ప్రకటన చేయడమే తరువాయి ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీ లేదా ఆ తరువాత ఎప్పుడైనా నిర?యం వెలువడే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. దీనిని 64 సంవత్సరాలకు పెంచనున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ విభాగంలో సుమారు 3,56,135 మందికి పైగా శాశ్వత ఉద్యోగులు వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రిటైర్ అయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు పొడిగింపు ఉండబోదని 2025 జూన్ నెలలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో నిర?యం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత జరుగుతున్న ఈ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. అయితే తెర వెనుక మాత్రం మూడు సంవత్సరాల సర్వీసు పొడిగింపుపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పెట్టారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, గౌరవ వేతనంతో సుమారు 4 లక్షల మంది వరకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్నారు. ఉద్యోగుల వివరాలను ఆధార్ తో అనుసంధానం చేసేందుకు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ శాఖల వారీగా, విభాగాల అధిపతుల వారీగా విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీ వేజ్, గౌరవ వేతనంతో పనిచేస్తున్న వారి వివరాలు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజిమెంట్ అండ్ ఇనార్మేషన్ సిస్టమ్ (ఐఎఫ్ఐఎంఎస్) వెబ్ పోర్టల్ ద్వారా కమిటీ సేకరించింది. గత నెల వరకు అందిన వివరాల ప్రకారం సుమారు 4 లక్షల మంది వరకు పనిచేస్తున్నట్లు తేలింది. ఇంకా ఆ లెక్కలను మదింపు చేసే పనిలో ఆర్థిక శాఖ ఉంది. అయితే చాలా మంది ఆధార్ కు అనుసంధానం చేయలేదని, ఈ ప్రక్రియ ఈ నెలలో పూర్తయ్యే అవకాశం ఉందంటున్నారు. ఆధార్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ పథకాలు ఎవరు పొందుతున్నారు, వారి హోదా, వివరాలు కూడా ప్రభుత్వం సేకరించింది. 37వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు తీసుకున్నట్లు వెల్లడి అయిందని వార్తలు వచ్చాయి. వీరిపై శాఖాపరంగా ఏ చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా ప్రభుత్వం ఇంకా నిర?యం తీసుకోలేదని సమాచారం.ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు ఉంటాయని ఆశించిన యువతకు నిరాశే ఎదురైంది. లక్షలాది ఉద్యోగాలు వస్తాయని, తమ బతుకులు బాగుపడతాయని ఊహించిన యువత తీవ్రంగా నష్టపోయింది. బీఆర్ఎస్ పాలనలో నియామకాలు చేపట్టకపోవడం మూలంగా ఒక జనరేషన్ పూర్తిగా ఉద్యోగ అవకాశాలను కోల్పోయింది. పదవీ విరమణ ప్రయోజనాలు వేల కోట్లు ఉండటంతో రిటైర్మెంట్ వయస్సును 61 ఏళ్లకు పెంపుదల చేసి, ఆ గండం నుంచి బీఆర్ఎస్ బయటపడింది. అలా సర్వీసు పొడిగింపు పొందిన వారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రిటైర్ అవుతున్నారు. వీళ్లకు పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించకుండా, బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక శాఖ వద్ద వేల కోట్ల పెండింగ్ బిల్లులు రిటైర్డు అయిన వారివి, సర్వీసులో ఉన్నవారివి కూడా ఉన్నాయి. ప్రతి నిత్యం వందల మంది రిటైర్డు ఉద్యోగులు బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయానికి వచ్చి రిక్త హస్తంతో వెనక్కి వెళ్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తారని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారని ఊహించిన వారికి మొండి చెయ్యి ఇచ్చింది. ఆర్థికంగా నిధులు సర్దుబాటు కాకపోవడం, వచ్చిన డబ్బులను కాంట్రాక్టర్లకు మళ్లించడం మూలంగా మిగతా చెల్లింపులకు సమస్యలు వస్తున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ గండం నుంచి గట్టెక్కేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 64 కు పెంచాలని నిర?యించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నిర్ణయంఈ ఏడాది జూన్ 2వ తేదీ లేదా ఆ తరువాత ఎప్పుడు అయినా ప్రకటన వెలువరిస్తుందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.జూన్ నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నర సంవత్సరాలు అవుతుంది, మూడు సంవత్సరాల పొడిగింపు మూలంగా ఆ భారం వచ్చే సర్కార్ పై ఉంటుందనే ముందు చూపులో భాగంగా ఈ నిర?యం అంటున్నారు. అప్పుడు కూడా కాంగ్రెస్ వస్తే సరి లేదంటే వచ్చే సర్కార్ కు పదవీ విరమణ ప్రయోజనాలు గుదిబండగా మారనున్నాయి. రిటైర్మెంట్ అయిన వారి పెండింగ్ బిల్లులు రూ.10వేల కోట్ల వరకు ఉన్నట్లు ఒక అంచనా.

కేసీఆర్ సర్కార్ రిటైర్మెంట్ వయస్సు పెంపు

ఉద్యోగుల పదవీ విరమణ మొత్తం వేల కోట్ల రూపాయలు ఉండడం, కాళేశ్వరం ప్రాజెక్టు కు చెల్లింపులు ఉండడంతో అప్రమత్తమైన కేసీఆర్ సర్కార్ రిటైర్మెంట్ పై కీలక నిర?యం తీసుకున్నది. 2021 మార్చి నెలలో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిటైర్ అయ్యే వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. రిటైర్ అయ్యే వారికి సకాలంలో చెల్లించకపోవడం, ఆ బకాయిల గుట్ట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పై పడింది.

టీజీపీఎస్సీ నోటిఫికేషన్లు అనుమానమే

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 64 ఏళ్లకు పెంచే నిర్ణయంతో టీజీపీఎస్సీ ఉద్యోగ నియామకాలు ఉండకపోవచ్చని, జాబ్ క్యాలెండర్ కూడా అనుమానమేనన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. ఉద్యోగ విరమణలతో ఖాళీలు ఏర్పడుతాయని, కానప్పుడు కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయని సచివాలయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే వరకు ఎలాంటి కొత్త నియామకాలు ఉండవనేది స్పష్టమవుతున్నది.

## కాలుష్య పరిశ్రమలపై గట్టి చర్యలు

హైదరాబాద్,చౌటుప్పల్ ప్రాంతంలో పలు ఫార్మా కంపెనీలు కాలుష్యకారకంగా మారుతున్న క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి గట్టి చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. చౌటుప్పల్‌లో 8 పరిశ్రమలకు జరిమానా విధించామన్నారు. మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భహంగా మాట్లాడుతూ...భువనగిరి ప్రాంతంలో 18 పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామని, ఎక్కడైనా పరిశ్రమలు వాతావరణాన్ని కలుషితం చేస్తుంటే తమకు ఫిర్యాదు చేయొచ్చని సురేఖ తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. కొండగట్టు, వేములవాడ తదితర ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని, మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని తమ సర్కారు హయాంలో అభివృద్ధి చేయడం అదృష్టంగా భావిస్తున్నానని సురేఖ అన్నారు. చౌటుప్పల్‌లో పారిశ్రామిక కాలుష్యంపై సీపీఐ సభ్యుడు నెల్లికంటి సత్యం, కొండగట్టు ఆలయాభివృద్ధిపై

# పులుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్,ప్రకృతిని పరిరక్షించుకునే క్రమంలో పులులను కూడా కాపాడుకోవాల్సి ఉంది. ఈ జాతని మనుగడ సాగించేలా పరిస్థితులు కల్పించాలి. పులులను ఉచ్చులో పడేసి చంపడం, కరెంట్ తీగల పెట్టడం లాంటి చర్యలు తీవ్రంగా పరిగణించాలి. 2016లో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నారం అడవుల్లో వేటగాళ్ల ఉచ్చుకు మగపులి బలైంది. 2018లో తిప్పేశ్వర్ నుంచి ఆదిలాబాద్, కవ్వాల్ మీదుగా జైపూర్ మండలం శివ్వారం ఫారెస్ట్‌లోకి ప్రవేశించిన టైగర్‌ను కరెంట్‌షాక్‌తో చంపిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. 2014 జనవరిలో కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్‌లోని దరిగాం సమీపంలో కే4, కే15 అనే రెండు పులులు స్థానికుల విషప్రయోగానికి బలయ్యాయి. ఈ ఏడాది కాగజ్‌నగర్ డివిజన్ పెంచికల్‌పేట రేంజ్‌లోని నల్లకుంట అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ పులి చనిపోయింది. అనంతరం దాని చర్మం, గోళ్లు, పండ్లను ఎత్తుకెళ్లారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.ఇటీవల రీంనగర్ రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట, చామన్‌పేట శివారులో పులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు పొలం వద్దకు వెళ్లగా.. ఒడ్డుపై జంతువు అడుగులు కనిపించాయి. అటవీశాఖ అధికారులు పొలం వద్దకు చేరుకొని అడుగుల గుర్తులు పులివేనని నిర్ధారించారు.బహదూర్‌ఖాన్‌పేటలోని ఓ మామిడితోటలో సైతం పులి అడుగులను గుర్తించారు. పులి సంచారంతో చామన్‌పల్లి, వెదురుగట్ట, చర్లబూత్కుర్, కొండాపూర్, ఐతరాజుపల్లి గ్రామాల ప్రజలు రాత్రి వేళ బయట తిరగొద్దని ఫారెస్ట్ ఆఫీసర్లు హెచ్చరించారు. ములుగు జిల్లా ప్రజలను పెద్ద పులులు కలవరపెడుతున్నాయి. రెండు రోజుల కింద మగ పులి, తాజాగా ఆడ పులి సంచారంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అబ్బాపూర్ శివారు పంట పొలాల్లో పులి పాదముద్రలు గుర్తించినట్లు ఆఫీసర్లు తెలిపారు. మగపులి పందికుంట రేంజ్‌నుంతి సర్వీపూర్ మీదుగా వైల్డ్ లైఫ్ అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని, సోమవారం వచ్చింది ఆడ పులి అని రేంజ్ ఆఫీసర్ డోలి శంకర్ తెలిపారు. పులుల సంచారంతో ములుగు, జాకారం, అబ్బాపూర్, పందికుంట గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

రాయపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపూర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మృతి చెందినట్టు తెలుస్తోంది. సుక్మా జిల్లాలో తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నాయి. నక్సలైట్ల సంచారం ఉన్నట్టు సమాచారం అందడటంతో జిల్లాకు చెందిన రిజర్వ్ గార్డ్ పోలీసుల బృందం ఈ తెల్లవారుజామున రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే నక్సల్స్, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి

# ఎన్నికలకు ముందే మహాయుతి దూకుడు

ముంబై,మహారాష్ట్ర పురపోరులో.. అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ పక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలపై అధికార ప్రభుత్వం ఆనందం వ్యక్తంచేసింది. ఈ విజయాలపై శివసేన పార్టీ (ఉద్ధవ్ ఠాక్రే) స్పందిస్తూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర సంస్థలను అడ్డుగా పెట్టుకొని ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించడం, లంచం ఇవ్వడంతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కారని ఆరోపించింది.

## బంగ్లాలో ఆగని దాడులు

ఢాకా,బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలయ్యాడు..వరుస దాడులతో హిందువులు భయాందోళనలకు గురవుతున్నారు.బంగ్లాదేశ్ లో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. వరుసగా హిందువులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్(50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడి చేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారి నుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల దుకాణాన్ని మూసి ఆటోలో ఇంటికి బయలుదేరగా.. మార్గమధ్యలో కొందరు దుండగులు ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో చంద్రదాస్‌పై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. వారి నుంచి తప్పించుకునేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశారు. తర్వాత స్థానికులు ఆయనను కాపాడి.. ఆస్పత్రికి తరలించారు. తమకు శత్రువులు ఎవరూ లేరని, ఆయనపై ఎందుకు దాడి

# ఉమ్మడి ఏపిలో కూడా ఇలా జరగలేదు

హైదరాబాద్,ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహర శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు. నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంత నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లా, రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకు అసెంబ్లీకి వెళ్లాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్, సీఎం సభ సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు.

# ప్రతిష్టకు ఎగనామం..

హైదరాబాద్, జీహెచ్ఎంసీ మాదిరిగానే పరిపాలన సౌలభ్యం కోసం రాజధానిలోని మూడు పోలీసు కమిషనరేట్లను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. కొత్త జోన్లు, డివిజన్లు, పోలీసుస్టేషన్లు... పరిధులతో రూపురేఖలు మార్చింది. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధులు మారగా... రాచకొండ స్థానంలో మల్కాజిగిరి కమిషనరేట్ వచ్చింది. ఈ పేరుపైనే అనేక విమర్శలు వస్తున్నాయి. మరోపక్క మేడ్చల్ పోలీసుస్టేషన్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌లో కలపడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండటం, మల్కాజిగిరి పేరుతో కమిషనరేట్ ఏర్పాటు చేస్తున్నప్పుడు మేడ్చల్‌ను సైబరాబాద్‌లో చేర్చడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు ఈ కమిషనరేట్లలో అధికారికంగా నేటి (శుక్రవారం) నుంచి కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

అప్పట్లోనే అనేక విమర్శలు..

ఒకప్పుడు హైదరాబాద్ కమిషనరేట్ మాత్రమే ఉండేది. 2002లో సైబరాబాద్ కమిషనరేట్‌కు రూపమిచ్చిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం 2016లో సైబరాబాద్‌ను విడగొడుతూ నల్లగొండలోని కొన్ని ప్రాంతాలను కలిపి మరో కమిషనరేట్ ఏర్పాటు చేసింది. తొలినాళ్లల్లో దీన్ని సైబరాబాద్ ఈస్ట్ అన్నా..ఆపై రాచకొండగా మార్చారు. దీనికి ఆ పేరు పెట్టడంపై అప్పట్లో అనేక విమర్శలు సైతం వచ్చాయి. ఇప్పుడు హైదరాబాద్. రాచకొండల్లో ఉన్న ప్రాంతాలతో ఏర్పడిన కొత్త కమిషనరేట్‌కు మల్కాజిగిరి అని పేరు పెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

జగమెరిగిన సికింద్రాబాదే మేలు..

దేశంలోనే కాదు.. ప్రపంచం పటంలోనే హైదరాబాద్‌తో పాటు సికింద్రాబాద్ పేరు సుపరిచితమే. రైల్వేస్టేషన్, మహంకాళి దేవాలయం, పరేడ్ గ్రౌండ్స్, కంటోన్మెంట్ బోర్డు, బైసన్ పోలో, జింఖానా గ్రౌండ్స్ ఉండటం దీనికి ప్రధాన కారణం. మరోపక్క సికింద్రాబాద్‌కు బ్రిటిషర్ల కాలం నుంచీ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. కొత్తగా ఏర్పడిన కమిషనరేట్‌లో ఈ ప్రాంతాలు కూడా ఉన్నాయి. దీంతో సికింద్రాబాద్ పేరు ఖరారు చేస్తే ఉత్తమం అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బృహత్ జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించి గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ సికింద్రాబాద్, గ్రేటర్ సైబరాబాద్‌గా మార్చడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే విషయం గమనార్హం.

ఇబ్బందులు..

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ మధ్య సిబ్బంది విభజన విషయంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన కేటాయించుకుని, భవిష్యత్తులో తుది చర్యలు తీసుకోనున్నారు.

ఇలా విస్తరించి ఉండటంతో...

హైదరాబాద్, సైబరాబాద్ మొత్తం చార్మినార్ జోన్‌లో భాగం. రాచకొండ మాత్రం చార్మినార్ జోన్‌తో పాటు యాదాద్రిలోనూ విస్తరించి ఉంది. ఈ కమిషనరేట్ మల్కాజిగిరిగా మారే వరకు యాదాద్రి ప్రాంతం కూడా ఇందులో భాగంగానే ఉండేది. దీంతో ఈ కమిషనరేట్‌లో రెండు జోన్లు ఉండేవి. పునర్వ్యవస్థీకరణ తర్వాత రాచకొండలోని కొన్ని ప్రాంతాలు మల్కాజిగిరిలో, కొన్ని హైదరాబాద్‌లో వచ్చి కలిశాయి. దీంతో ఇక్కడి సిబ్బంది సాంకేతికంగా హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలో పని చేస్తున్నా... వారి నియంత్రణ అధికారం మాత్రం చార్మినార్, యాదాద్రి జోన్లకు సంబంధించిన డీఐజీలకే ఉంటుంది. దీంతో భవిష్యత్తులో వీరికి పదోన్నతులు కల్పించాలంటే ఈ రెండు జోన్లకు చెందిన డీఐజీలకు జాబితా పంపి, దాని ఆధారంగానే ముందుకు వెళ్లాల్సి ఉండటంతో సీనియారిటీ జాబితా తయారీలో సాకేంతిక ఇబ్బందులు వస్తాయి.

సైబరాబాద్‌లో కలుస్తున్న 'జిల్లా'..

మల్కాజిగిరి కమిషనరేట్‌లోనూ ఇలాగే హైదరాబాద్, యాదాద్రి జోన్లకు ఎంపికైన వాళ్లు ఉన్నారు. మరోపక్క సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోకి పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్సీపురం తదితర ప్రాంతాలను తీసుకువచ్చి కలిపారు. కానిస్టేబుల్ స్థాయి అధికారుల రిక్రూట్‌మెంట్ రెవెన్యూ జిల్లా, యూనిట్ స్థాయిలో జరుగుతుంది. ప్రస్తుతం సైబరాబాద్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు భౌగోళికంగా ఆ కమిషనరేట్‌కు చెందిన స్థానికులు అవుతారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన వాళ్లు అమీన్‌పూర్, పటాన్‌చెరువు, ఆర్సీపురం ఠాణాల్లో పని చేస్తూ ఉంటారు. ఈ కారణంగా వీరి సీనియారిటీ జాబితా తయారీ, పదోన్నతులు సైతం చార్మినార్ జోన్‌తో పాటు సంగారెడ్డిలకు పంపాల్సి ఉంటుంది. ఈ సాంకేతిక కారణాలను అధిగమించాలంటే జోన్లను పునర్వవస్థీకరించాల్సి ఉంది. ఆ మేరకు ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపి ఆ మొత్తం పొంది రాష్ట్రపతి ద్వారా ఉత్తర్వులు వెలువడాలి. దీనికి సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది విభజన చేసుకోనున్నారు.

# నాగర్‌కర్నూల్ కాంగ్రెస్‌లో గుబులు..



నాగర్‌కర్నూల్: అంతా వన్ సైడ్ అనుకున్న నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీన్ రివర్స్ అయ్యిందటా.. రెండేళ్ల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకుంటూ, ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉండటంతో పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు తమకే తథ్యం అనుకున్న కాంగ్రెస్ శ్రేణుల ఆశలకు గండి పడిందంట .. అధికారంలో ఉండి కూడా సర్పంచ్ అభ్యర్థి దొరకపోవడం, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి సర్పంచ్‌గా ఏకగ్రీవం కావడం చర్చనీయాంశంగా మారిందిక్కడ.. ఇద్దరు ప్రజాప్రతినిధుల ఆశలకు రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు వెన్నుపోటు పొడవడంతో రిజల్ట్ తలకిందులైందంట.. అసలు నాగర్‌కర్నూల్ పంచాయతీ ఎన్నికల్లో ఏం జరిగింది?

కాంగ్రెస్‌కు డేంజర్ బెల్ మోగించిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు

నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ సెగ్మెంట్లో స్థానిక సంస్థల ఎన్నికలలో మొదటి, 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి డేంజర్ బెల్ మోగించాయి.. నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుండి ఎమ్మెల్సీగా కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే గా డాక్టర్ కుచుకుళ్ళ రాజేష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.. గతంలో బీఆర్ఎష్ అభ్యర్థిగా రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్లో కొనసాగే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఆయన పార్టీ మారే విషయమై ఆలోచనలో పడ్డారంట.

సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి ఎదుగు, బొదుగు లేని కాంగ్రెస్

ఒకవైపు కాంగ్రెస్ అధికారంలో ఉండి నాగర్‌కర్నూల్ సెగ్మెంట్లో ఆ పార్టీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఉండి ప్రభుత్వ పథకాల గురించి ఊదరగొడుతున్నా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే సర్పంచి ఎన్నికల ఫలితాలలో ఎలాంటి ఎదుగుదల లేకుండా గొర్రెతోక బెత్తడే అన్న చందంగా ఉండిపోవడం చర్చనీయాంశంగా మారింది.. నియోజకవర్గం నుంచి గ్రామ స్థాయి వరకు , లీడర్ నుండి కేడర్ వరకు కకావికలమవుతున్నా గులాబీ పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ తగ్గకపోవడం కాంగ్రెస్ శ్రేణులను కలవరపరుస్తోందంట.

అధికార పార్టీకి దొరకని సర్పంచ్ అభ్యర్థులు

నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నాగర్ కర్నూల్, బిజినాపల్లి ,తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి మండలాలున్నాయి. అందులో 131 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు 71 మంది గెలుపొందగా బీఆర్ఎస్ హాఫ్ సెంచరీ కొట్టి అధికార పార్టీకి సవాల్ విసిరింది.. తాడూరు మండలం ఎట్టిదర్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి కవిత అర్జున్, బిజినపల్లి మండలం రాంరెడ్డిపల్లి తండా సర్పంచ్‌గా ఆ పార్టీ అభ్యర్థి పట్లవత్ సాలి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఆ పంచాయతీల్లో అధికార పార్టీకి సర్పంచ్ అభ్యర్థి దొరకపోవడం హాట్ టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్యే స్వగ్రామంలో అతికష్టం మీద గెలిచిన కాంగ్రెస్

ఇక సెగ్మెంట్లో బీజేపీ మూడు స్థానాల్లో , సిపిఐ ఒక స్థానంలో గెలుపొందగా స్వతంత్రులు ఆరుగురు గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వగ్రామం తిమ్మాజిపేట మండలం నేరేళ్లపల్లి గ్రామంలో సర్పంచ్ స్థానం మీసాల లక్ష్మి సహావార్డ్ మెంబర్ల దాకా క్లీన్ స్వీప్ చేసింది. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ మండలం తుడుకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మమ్మ కరా?కర్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిపై అతి కష్టం మీద గట్టెక్కారు. మొత్తం మీద బీఆర్ఎస్‌కి గ్రామీణ స్థాయి ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నది కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి మరింత చొచ్చుకు పోవాల్సిన అవసరం ఉందన్న విషయం ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి..

నియోజకాభివృద్ధికి రూ. 1000 కోట్లు తెచ్చిన ఎమ్మెల్యే

రెండేళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి 1000 కోట్ల పైచిలుకు నిధులు అభివృద్ధి కోసం తీసుకొచ్చారు. వాటికి సంబంధించిన కార్యక్రమాలు కొన్ని కొనసాగుతున్నా కొన్నిటికి నేటికి టెంకాయ కొట్టకపోవడం విశేషం.. అదే రోడ్ల విషయంపై సర్పంచ్ ఎన్నికల్లో తాడూరు మండలం ఐతోలు గ్రామంలోని కోమటి తండాలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేని గ్రామస్థులు అడ్డుకున్నారంట.. అభివృద్ధి పథంలో నడిపేందుకు తీసుకొచ్చిన నిధులు మంజూరు విషయం పట్టణ స్థాయి నుండి గ్రామీణ స్థాయి వరకు ప్రజలకు చేరవేయడంలో ప్రధాన భూమిక పోషించే పార్టీ సోషల్ మీడియా ఆక్టివ్ గా లేదంట.

మొత్తమ్మీద చేస్తున్న అభివృద్ధిపై నాయకులు ప్రచారం చేసుకోకపోవడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పలుచోట్ల ఎదురుదెబ్బ తగిలిందంటున్నారు. దీనికి తోడు పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ఒక్కరినే పోటీలో పెట్టే విషయంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి వైఫల్యం చెందారన్న టాక్ వినిపిస్తుంది ఒక గ్రామపంచాయతీలో అధికార పార్టీ నుండి ముగ్గురు వరకు పోటీలో దిగడం, అభివృద్ధిని ప్రజలకు చేరవేసే విషయంలో ఫెయిల్ కావడం వల్లే ఈ ఎన్నికల రిజల్ట్ రివర్స్ అయిందంటున్నారు

మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై క్యాడర్లో గుబులు

నియోజకవర్గంలో ఇప్పటికైన జరుగుతున్న అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లాలని లేకపోతే రానున్న మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై దాని ప్రభావం పడుతుందని క్యాడర్ వాపోతోంది. చ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగితే అధికార పార్టీకి నాగర్‌కర్నూల్‌లో గడ్డు కాలం తప్పదంటున్నారు.

# పాత కష్టాలు తొలగేనా ?

న్యూఢిల్లీ,కేంద్రం ఇటీవల ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్-గ్రామీణ్(జీ రామ్ జీ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు, చేసిన పనులకు సంబంధించి బోగస్ రికార్డులను సృష్టిస్తుండటం వల్ల పెద్దయెత్తున ప్రజాధనం పక్కదారి పడుతోందని పలు అధ్యయనాలు తేల్చాయి. మరి వీటిని సరిదిద్ది, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడానికి కొత్త చట్టం ఉపకరిస్తుందా? వికసిత్ భారత్ ఆవిష్కరణలో వారిని భాగస్వాములను చేస్తుందా?గ్రామాల్లోని కూలీలకు ఏటా వంద రోజులపాటు పనులు చూపించేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీనరేగా) పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ, దీని అమలులో అనేక లోపాలు పొడచూపాయి. అసలు ఉనికిలో లేని కూలీలనూ... ఎక్కడో నగరాలు, పట్టణాల్లో ఉంటున్నవారిని సైతం ఉపాధి హామీ లబ్ధిదారులుగా చూపి డబ్బులు కాజేసినట్లు వెల్లడైంది. ఈ అక్రమాల్లో కొందరు అధికారుల పాత్ర వెలుగులోకి రావడం విస్మయం కలిగించింది. కూలీలకు చెల్లించిన వేతనాలను అసలుకన్నా చాలా ఎక్కువగా చూపడం, పనుల కోసం కొన్న సామగ్రి విలువను బాగా పెంచి రాయడం, బోగస్ సరఫరాదారులకు చెల్లింపులు జరపడం వంటి పద్ధతుల్లో అవినీతి జరిగినట్లు తెలియవచ్చింది. జవాబుదారీ కోసం సామాజిక ఆడిట్లు నిర్వహించినా, అవి జరగాల్సినంత విస్తృతంగా జరగలేదు. వాటిలో స్థానికుల భాగస్వామ్యం అంతంతమాత్రమే. పైగా ఉపాధి సొమ్ము స్వాహాదారులపై చర్య తీసుకోవడానికి స్థానిక అధికారులు మొరాయిస్తున్నారు. ఎంజీనరేగా కింద వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం జరుగుతుండటంతో నిజమైన పనివారిలో పలువురు ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. దాంతో దళారులు బోగస్ పనివారిని చూపి డబ్బులు స్వాహా చేసినట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.

గ్రామీణ ఆర్థికానికి ఊతమివ్వాలని...

దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల స్థాయిలో సాంకేతికంగా, పాలనాపరంగా సుశిక్షితులైన సిబ్బందికి తీవ్ర కొరత ఉంది. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాల్సిన సిబ్బందికీ ఇటువంటి శిక్షణ లేదు. దాంతో పథకం అమలుకు పకడ్బందీ ప్రణాళికా రచన జరగలేదు. సమర్థ పర్యవేక్షణ కూడా కొరవడింది. ఇదంతా అవినీతిపరులకు అనువుగా మారింది. దీనికి తోడు నరేగా అమలు విపరీతంగా కేంద్రీకృతమైంది. గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ అరకొరగా ఉండటం, హాజరు తీసుకోవడానికి ఉపయోగించే ఎన్ఎంఎంఎస్ యాప్ వంటి కీలకమైన అప్లికేషన్లలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల నిజంగా అర్హులైన కార్మికుల పేర్లు జాబితా నుంచి అదృశ్యమవుతున్నాయి. స్థానిక పంచాయతీ అధ్యక్షులు, పెత్తందార్లు, దళారులతో అవినీతిపరులైన అధికారులు కుమ్మక్కవుతున్నారు. ఇది అవినీతికి ఎర్రతివాచీ పరుస్తోంది. పైగా, ఎంజీనరేగా చట్టం ద్వారా తమకు లభించే హక్కులు, సౌకర్యాల గురించి చాలామంది గ్రామీణులకు సరైన అవగాహన లేదు.

దాంతో అవినీతిపరులు ఇష్టారాజ్యంగా ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. విస్తృతస్థాయిలో పాతుకుపోయిన ఈ అక్రమాలను అరికట్టి, లోపాలను సవరించి పకడ్బందీగా గ్రామీణ ఉపాధి కల్పించడానికి జీ రామ్ జీ-2025 చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం చెబుతోంది. గ్రామీణ ఉపాధి కల్పనా వ్యవస్థను ఆధునికీకరించి, సమర్థంగా అమలు చేయడంతో పాటు యావత్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఊతమివ్వాలన్నది కొత్త శాసన లక్ష్యమని పేర్కొంటోంది.ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన 'జీ రామ్ జీ' ద్వారా ఏడాదిలో మొత్తం పనిదినాలను 150కి పెంచుతారు.



ఎంజీనరేగా కింద గ్రామీణ కుటుంబాలు దరఖాస్తు పెట్టుకుంటేనే పనులు చూపించేవారు. 'జీ రామ్ జీ' పథకం మాత్రం అందుబాటులోని నిధులను ఉపయోగించుకుంటూ, అవసరమైన పనులకు గ్రామీణులను నియోగించాలని ఉద్దేశిస్తోంది. ఎంజీనరేగాకు కేంద్రమే పూర్తిగా నిధులిచ్చేది. 'జీ రామ్ జీ' కోసం రాష్టాలు సైతం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థికపరమైన బాధ్యతతో పాటు నిబద్ధత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, కాలువల తవ్వకం, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి ప్రజా పనులను మాత్రమే కాకుండా... వ్యవసాయ కార్యకలాపాలు, గ్రామీణార్థికానికి ఊతమిచ్చే పనులను కూడా 'జీ రామ్ జీ' పథకం పరిధిలోకి తీసుకొస్తారు. దీని కింద సక్రమంగా చెల్లింపులు జరపడానికీ, జవాబుదారీతనాన్ని పెంచడానికీ డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తారు. తద్వారా పారదర్శకత పెరుగుతుంది.

లోపాలను తక్షణమే సరిదిద్దాలి...

దిల్లీ, చండీగఢ్‌లు మినహా దేశవ్యాప్తంగా 741 జిల్లాల్లోని 2.69 లక్షల పంచాయతీల్లో 12.15 కోట్ల మందికి ఎంజీనరేగా ద్వారా లబ్ధి చేకూర్చినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి పార్లమెంటు స్థాయీ సంఘానికి వెల్లడించారు. ఎంజీనరేగా లబ్ధిదారుల్లో సగం మంది మహిళలు కాగా, 36శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారున్నట్లు కార్యదర్శి నివేదించారు. ఈ నేపథ్యంలో 'జీ రామ్ జీ' పథకంపై రాజకీయ పార్టీలు, గ్రామీణాభ్యుదయ విధాన నిపుణుల నుంచి రకరకాల వ్యాఖ్యలూ సలహాలూ వినవస్తున్నాయి. పనిదినాల పెంపు ద్వారా లబ్ధిదారులకు నిజంగా ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తుందా అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సకాలంలో వేతనాలు చెల్లించడం, నిర్వహణాపరమైన లోపాలను సరిదిద్దడం వంటివి తక్షణం జరగకపోతే కొత్త పథకంతో ప్రయోజనాలు నామమాత్రమే అవుతాయని అవి హెచ్చరిస్తున్నాయి. ఎంజీనరేగా ద్వారా ఏడాదిలో వంద రోజుల పాటు పనిదినాలను చూపాల్సి ఉన్నా, చాలా రాష్ట్రాల్లో సగటున 50 రోజులతోనే సరిపెట్టినట్లు వివిధ అధ్యయనాలు తేల్చాయి. ఈ లోపాన్ని సరిదిద్దడానికి శ్రద్ధ వహించాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం రాజ్యసభకు తెలిపింది. 'జీ రామ్ జీ' చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను వచ్చే ఆరు నెలల్లో రూపొందించిన తరవాతే దాన్ని అమలు చేస్తారు. 'జీ రామ్ జీ' చట్టం గ్రామీణులకు నికరంగా మరిన్ని పనిదినాలు కల్పించడానికీ, పల్లెల్లో మౌలిక వసతులను విస్తరించడానికీ తోడ్పడుతుందని ప్రభుత్వం ఉదౌటిస్తోంది. అదెంతవరకు నిజమవుతుందో చూడాలి!

# అంతర్వేది రథ శకలాల నిమజ్జనం

అమరావతి,బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథ శకలాల నిమజ్జన కార్యక్రమం వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథం దహనమైన సంగతి తెలిసిందే. ఆ రథం స్థానంలో కొత్త రథాన్ని అంతర్వేది దేవస్థానం ఏర్పాటు చేసింది. పాత రథాన్ని ఆగమశాస్త్ర విధానాలు, నిబంధనలకు లోబడి నిమజ్జనం చేసే కార్యక్రమంపై ఇటీవలే దేవాదాయ శాఖ కార్యాచరణ ప్రకటించింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రథ శకలాల నిమజ్జనం చేయాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రకటించింది. ఆగమశాస్త్ర నిబంధనలు, మూహూర్తాలపై చర్చించిన అనంతరం దేవాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. మరింత విస్తృత చర్చల అనంతరం... పూర్తి స్థాయి ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం అభిప్రాయాలు సేకరించి రథ శకలాలను నిమజ్జనం చేయాలని నిర్ణయించింది. భక్తుల మనోభావాల నేపథ్యంలో నిమజ్జన ప్రక్రియను మరో ముహూర్తంలో అత్యంత శాస్త్రబద్దంగా జరపాలని దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

# తెలుగు మహాసభలకు అంకురార్పణ

గుంటూరు, మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు అంకురార్పణ జరిగింది. శనివారం ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఇక నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతు న్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పలువురికి పురస్కారాలను అందజేయనున్నారు. ఐదు సువిశాల వేదికల్లో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలకు గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారు. ఆదివారం ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ పాల్గొననున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఒక దేశాధ్యక్షుడు రావడం ఇదే ప్రథమం. ఇక సోమవారం నాడు జరిగే మహాసభల్లో సీఎం చంద్రబాబు నాయుడు,మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పాల్గొననున్నారు. ప్రముఖుల హాజరుతో ప్రపంచ తెలుగు మహాసభలు మరింత వైభవంగా సాగనున్నాయి.

# అమరావతిలో మంత్రులు, ఐఎఎస్, జడ్జిల నివాసాలు

అమరావతి, అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ప్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుద దశకు చేరిందని.. అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు. 500 నివాస సముదాయాలను మినహా, మిగతా భవనాలు మార్చి ముగింపు వరకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని భవనాలు పూర్ఖైన తర్వాత జీఏడీకి హ్యాండ్ ఓవర్ చేస్తామని.. వారు కేటాయిస్తారని మంత్రి తెలిపారు. అలాగే అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ కోసం భూసేకరణ నోటిఫికేషన్ వచ్చే బుధవారం (జనవరి 7) ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంకా 4.5 ఎకరాలు భూమి రావాల్సి ఉందని, ఇందులో 2 ఎకరాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# అనంతలో ఘోర రోడ్డు ప్రమాదం

అనంతపురం,అతివేగం ఇద్దరిని బలిగొంది. మడకశిర మండలంలోని అగ్రంపల్లి సమీపాన గురువారం అర్ధరాత్రి ఎన్‌హెచ్ 544 ఈ జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో అతివేగంతో ఢీకొట్టడంతో డ్రైవర్లు మహమ్మద్ రఫిక్ (32), రఘురామ్(19) దుర్మరణం చెందారు. రెండువాహనాలు నుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర పట్టణంలోని వడ్రపాళ్యం ప్రాంతానికి చెందిన రఘురామ్ బొలెరో వాహనంలో గుడిబండ సంత నుంచి హిందూపురానికి పశువులను తీసుకెళ్లాడు.అక్కడ దించేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన మహమ్మద్ రఫిక్ వ్యాన్‌లో పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని పుణెకి తీసుకెళ్లాడు. అక్కడ దించేసి కియకి తిరుగి వస్తున్నాడు. అగ్రంపల్లి వద్ద జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో వాహనం అతివేగంతో ఎదురుగా వెళ్లి ఢీకొంది. ఇరు వాహనాల డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. బొలెరో వాహనంలోని భువనేశ్వర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రఘురామ్ తండ్రి శివానంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రఘురామ్‌కు వివాహం కాలేదు. మహమ్మద్ రఫిక్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

## అమరావతిలో మంత్రులు, ఐఎఎస్, జడ్జిల నివాసాలు

అమరావతి: అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ప్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నా రు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుద దశకు చేరిందని.. అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు. 500 నివాస సముదాయాలను మినహా, మిగతా భవనాలు మార్చి ముగింపు వరకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని భవనాలు పూర్ఖైన తర్వాత ఏడీకి హ్యాండ్ ఓవర్ చేస్తామని.. వారు కేటాయిస్తారని మంత్రి తెలిపారు. అలాగే

# కనిపించని టెన్షన్ లో పయ్యావుల...



అనంతపురం, జనవరి 5,ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆయనకు ఆర్థిక శాఖ అప్పగించడంతో పెద్దగా బయట కనపించడం లేదు. అలాగే విపక్షాల విమర్శలపై కూడా పయ్యావుల కేశవ్ పెద్దగా స్పందించడం లేదు. తన పని తాను చేసుకుపోతున్నారు. ప్రతి నెల మొదటి తారీఖు వచ్చే సరికి రుణాలు తీసుకు వచ్చే బాధ్యతతో పాటు అనేక రకాలమైన వత్తిళ్లతో ఆయన కొంత పాలనాపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. అందుకే పయ్యావుల కేశవ్ పెద్దగా గతంలో మాదిరిగా యాక్టివ్ గా లేరని అంటున్నారు. పయ్యావుల తాను చూసే శాఖకు తాను తగిన న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదనను కూడా సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.కేశవ్ తెలుగుదేశం పార్టీలో ఓ సీనియర్ లీడర్. దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోను పార్టీలో కీలక నేతగా ఎదిగారు. అయితే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఓడిపోతుంటే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన విజయాలు సాధిస్తూ వస్తున్నారు.

పయ్యావుల పార్టీ ప్రతిపక్షంలో ఉన్న 2004, 2009 ఎన్నికల్లో మాత్రం విజయం సాధించారు ఆయన 1999, 2014లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఓడిపోయారు. 2014లో ఓడిపోయినా ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు పయ్యావుల కేశవ్ గొంతు బలంగా వినిపించేది. ఆయన పీఏసీ ఛైర్మన్ గా ఉండి కూడా 2019 లో తన గళాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినిపించడంలో ఎక్కడా తగ్గలేదు. 2024 లో ఆయన గెలిచి.. పార్టీ గెలవడంతో చంద్రబాబు నాయుడు కీలకమైన ఆర్థిక శాఖను పయ్యావుల కేశవ్ కు అప్పగించారు.పయ్యావుల కేశవ్ కు పద్దుల టెన్షన్ ఎక్కువగా ఉంది. ఈసారి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి సమానంగా తీసుకెళుతున్నారు. దీంతో రెండింటికీ నిధుల సర్దుబాటుకే సమయం సరిపోతుంది. ఎక్కువ సార్లు పయ్యావుల కేశవ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులతో పాటు రుణాలకు సంబంధించిన అనుమతులు కూడా పొందాల్సి ఉంటుంది. ఒకవైపు చంద్రబాబు, లోకేశ్ లు ఢిల్లీ వెళ్లి నిధుల కోసం తిరుగుతున్నా, పయ్యావుల కేశవ్ పై ఆర్థిక మంత్రిగా బాధ్యత ఉండటంతో ఆయన ఎక్కువ టెన్షన్ పడుతున్నట్లు తెలిసింది. పయ్యావుల అధికారంలో ఉన్నప్పుడు కంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే యాక్టివ్ గా ఉన్నారన్నది పార్టీ నేతలు సయితం అంగీకరిస్తున్న విషయం. పయ్యావుల పద్దుల టెన్షన్ ఈ టెర్మ్ అంతా కొనసాగే అవకాశముంది. అందుకే చంద్రబాబు కూడా పయ్యావుల విషయంలో చూసీచూడనట్లు వదిలేస్తున్నారని వినికిడి.

# మేడారం మహా జాతర పనులు ఉధృతం..హైలెట్స్ ఇవే!

మేడారం: మేడారం మహా జాతర పనులు ఉద్ృతంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మేడారం మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 251 కోట్ల రూపాయలతో మేడారం సమగ్ర అభివ ృద్ధికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం గద్దెల విస్తరణకు 101 కోట్ల రూపాయలను కేటాయించింది. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నాలుగు వేల టన్నుల గ్రానైట్ తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులను చేపట్టారు.



మేడారం జాతర పనులలో వేగం

750 కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన ఏడు వేలకు పైగా శిల్పాలు రూపకల్పన చేశారు. 46 స్తంభాలతో 271 చదరపు కిలోమీటర్ల విస్తీర?ంలో ప్రాకారాన్ని నిర్మించారు. 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో మూడు స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణాన్ని నిర్మించారు. పూజారుల సంఘం ఆమోదంతో అన్ని పనులను వేగవంతం చేశారు.

వందల ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల నిర్మాణం

గతంలో చూసిన మేడారానికి ప్రస్తుతం చూడబోయే మేడారానికి చాలా తేడా ఉంటుందని, మేడారం మహా జాతర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో జరపడానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, మంత్రి సీతక్క లు పనులను పర్యవేక్షిస్తున్నారు. వందల ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెలను శాశ్వతంగా నిర్మాణం చేశారు. జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మేడారం జాతర ఘనంగా జరగనున్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తుల కోసం సకల సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు.

అన్ని శాఖల పనులలో స్పీడ్

ఇదిలా ఉంటే మేడారం జాతరలో పాల్గొనే అన్ని శాఖలు పనులలో స్పీడ్ పెంచాయి. నేడు వచ్చే మేడారం జాతరను సమర్థవంతంగా నిర్వహించాలని మల్టీ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. మేడారంలో ఏర్పాటుచేసిన పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో ఐజి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జాతరకు లక్షలాది ప్రజలు తరలివస్తారని, దానికనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎంతో దూరం నుండి భక్తులు వస్తారని వారికి దర్శనం సాఫీగా జరిగేలా తగిన బందోబస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత జాతరలో పనిచేసిన అనుభవం ఉన్న అధికారులు ఆయా జోన్ లలో,సెక్టార్ లలో తిరిగి పని చేయాలని సూచించారు. జాతరకు అవసరమైన సిబ్బందిని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మేడారం జాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచన చేశారు.

మేడారం జాతరకు వైద్య శాఖ చేపట్టవలసిన చర్యలు

వైద్యశాఖ కూడా మేడారం మహా జాతరకు సన్నద్ధమవుతోంది. మేడారం మహా జాతరలో వైద్య సేవలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన వైద్య సేవలను అందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల వైద్యశాఖ ఉన్నతాధికారులు నిర?యించారు. నేడు మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టవలసిన చర్యలపై ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల డీఎంహెచ్వో లు, సూపరింటెండెంట్ లు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్తలు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.

మేడారం జాతరకు స్పెషలిస్ట్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ హరీష్ చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మేడారం జాతర విధులలో ప్రభుత్వ వైద్యశాలలలోని స్పెషలిస్ట్ వైద్యులను నియమించుకోవాలని నిర?యించారు. ములుగు జిల్లాకు దగ్గరగా ఉన్న ములుగు, నర్సంపేట, భూపాలపల్లి మెడికల్ కళాశాలల మరియు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల స్పెషలిస్ట్ వైద్యులను డిప్యుటేషన్ చేసుకోవాలని నిర?యించారు. వైద్య సిబ్బందిని, టెక్నీషియన్లను పూర్తిస్థాయిలో డిప్యూట్ చేసుకోవాలని నిర?యం తీసుకున్నారు.

# ఏపీలో స్థానిక పోరు ఇంట్రెస్టింగ్

విజయవాడ, జనవరి 5,తెలంగాణలో లోకల్ ఫైట్ అయిపోయింది. నెక్స్ట్ ఏపీలో స్థానిక సమరానికి సమయం ఆసన్నమైందన్న టాక్ వినిపించింది. దీంతో ఏపీలోనూ స్థానిక ఎన్నికల న్యూస్ హాట్ టాపిక్ అయింది. స్టేట్ ఈసీ రివ్యూస్ లోకల్ బాడీ పోల్స్‌పై అప్డేట్స్ కమింగ్ అప్ అన్నట్లుగా మార్చేశాయికానీ ఏపీలో పంచాయతీ పోరుకు ఇంకా టైమ్ పట్టబోతోందట.ఏపీలో స్థానిక పోరు ఇంట్రెస్టింగ్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతుంది. సరిగ్గా ఇదే టైమ్‌లో లోకల్ బాడీస్ గడువు కూడా దగ్గర పడుతోంది. దీంతో స్థానిక సమరంపై కూటమి సర్కార్ ఫోకస్ పెట్టిందన్న టాక్ వినిపించింది.. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేస్తోందని కూడా ప్రచారం జరిగింది.స్టేట్ ఈసీ రివ్యూలు కూడా ఏపీలో లోకల్ ఫైట్‌పై ఆసక్తిని పెంచేశాయి. కట్ చేస్తే ఏపీలో ఇప్పట్లో పంచాయతీ ఎన్నికల పోరు జరిగే అవకాశం కనిపించడం లేదంటున్నారు. గడువుకంటే ముందే పంచాయతీ ఎన్నికలు పెట్టాలని ప్రభుత్వం భావించినా, కొన్ని కారణాల వల్ల ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదట.పంచాయతీల పునర్విభజన, విలీనం పూర్తికాకపోవడం ఎన్నికల నిర్వహణకు అడ్డుగా మారిందంటున్నారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి జనగణన ప్రారంభమవుతున్నందున పంచాయతీల విభజన జరగడం లేదని, దాంతో లోకల్ ఫైట్ ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు.ఏపీలో పంచాయతీ పాలకవర్గాలకు 2026 ఏప్రిల్ 2వ తేదీ వరకు గడువు ఉంది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన వరకు ఆ పంచాయతీ పరిధిలో మార్పులు, చేర్పులు చేయడం చట్టపరంగా కుదరదని చెబుతున్నారు. దీంతో జనవరిలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మార్చుకుని..పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాతే ఎన్నికలు పెట్టాలని నిర్ణయానికి వచ్చిందట.ప్రభుత్వ ఆలోచనల ప్రకారం వచ్చే ఏడాది జూన్ లేదా జులై నెలల్లోనే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. వాస్తవానికి మూడు నెలలు ముందుగా అంటే జనవరిలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచనలు కూడా ఇచ్చింది. స్టేట్ ఈసీ కూడా ఎన్నికల సన్నాహాలు స్పీడప్ చేసింది. జనవరిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అయితే కొన్ని రాజకీయ అంశాలు..మరికొన్ని టెక్నికల్ అంశాలు..పంచాయతీ పోరును లేట్ చేస్తుందన్న




టాక్ వినిపిస్తోంది.ప్రభుత్వంలో పంచాయతీ పాలకవర్గాలు ఉన్నంతకాలం మార్పులు చేయరాదని చట్టం చేశారు. ప్రస్తుతం పంచాయతీల పునర్విభజనకు ఈ చట్టమే అడ్డంకిగా మారిందట. గత ఎన్నికల్లో వైసీపీ సర్పంచ్‌లను ఏకపక్షంగా గెలుచుకుంది. ఇప్పుడు కూటమి కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ప్లాన్ చేస్తోంది.ఇందుకోసం కొన్ని రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి టీడీపీ, జనసేన నేతల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయట. కొన్ని పంచాయతీల్లో విపక్షం బలంగా ఉండటంతో వాటిని రెండుగా విడగొట్టడం లేదా దగ్గరలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయాలనే ప్రతిపాదన ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 150 ప్రపోజల్స్ వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ప్రభుత్వం చేసిన చట్టంతో న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో..ఏప్రిల్ 2వరకు వెయిట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందట. అప్పటి స్టేట్ ఈసీకి కొత్త కమిషనర్ వస్తాడని..కొత్త కమిషనర్ ద్వారానే ఎన్నికలు పెట్టాలనేది కూడా ఓ ఆలోచన అంటున్నారు. ఏదేమైనా ఏపీలో పంచాయతీ పోరు జూన్ లేదా జులైలోనే జరిగే అవకాశం ఉందన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది.

# వైసీపీ హయాంలో డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఏపీ



శ్రీకాకుళం,వైసీపీ హయాంలో ఏపీ డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఉండేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో గిరిజనులను బలిపశువులను చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉండేవని విమర్శలు చేశారు. ఆ పరిస్థితి మారాలని ఈ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) శ్రీకాకుళం ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు రామ్మోహన్ నాయుడు. ఏపీని ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచడానికి చంద్రబాబు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ కృషిలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల పని తీరు వర్ణించలేనిదని కొనియాడారు. గతంలో పోలీసులను రాజకీయ వేధింపులకు వాడుకునే వారని విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో పోలీసులకు శిక్షించడం మాత్రమే కాదని.. శిక్షణ ఇవ్వడం కూడా తెలుసు అనేలా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఒకప్పుడు పంజాబ్ వ్యవసాయానికి ప్రసిద్ధిగా ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు పంజాబ్‌లో అడుగడుగునా డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నాశనం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్‌లా ఏపీ మారకూడదనే తాము కంకణం కట్టుకున్నామని చెప్పుకొచ్చారు రామ్మోహన్ నాయుడు. గతంలో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మన తల్లుల ఆవేదన చూశామని అన్నారు.

తమకేం వద్దని.. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తే చాలని మన తల్లులు లోకేశ్‌ని కోరారని తెలిపారు. ప్రతీ ఇంట్లో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మన ఇంట్లోనే కాదని.. పక్క ఇంట్లో కూడా ఎవరైనా డ్రగ్స్ వాడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఒకరిని చూసి ఇంకొకరు నేర్చుకుంటారని అన్నారు. డ్రగ్స్ వాడకం కూడా అలాగే ఉంటుందని చెప్పుకొచ్చారు. సిగరెట్, డ్రగ్స్ వాడకం స్టైల్ కాదని.. నిజాయితీగా ఉండటం మాత్రమే అసలు సిసలైన్ స్టైల్ అని పేర్కొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనేది పిల్లల నినాదం కావాలని సూచించారు. శ్రీకాకుళం అంటే లేబర్ ప్రాంతం కాకూడదని తెలిపారు రామ్మోహన్ నాయుడు. శ్రీకాకుళం అభివృద్ధికి అడ్డా కావాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కూడా శ్రీకాకుళం అభివృద్ధికి సహాయం చేస్తోందని వెల్లడించారు. డ్రోన్స్ సాయంతో డ్రగ్స్ పంటలను గుర్తించామని తెలిపారు. డ్రగ్స్‌కి బదులు ఇప్పుడు మంచి పంటలు పండిస్తున్నామని వివరించారు. ఇచ్ఛాపురంలో చాలా కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇప్పుడు అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు యాత్ర నిర్వహించామని.. ఈ ముగింపు యాత్రను పోలీసులు చాలా గొప్పగా ఏర్పాటు చేశారని రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు.

# ఏఐతో పెద్ద ఎత్తున దర్శనాలు....



తిరుమల, జనవరి 5,తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, టీటీడీ అధికారులు అన్ని రకాల దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వదర్శనంతో పాటు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి, వీఐపీలకు బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. శనివారం ఒక్కరోజే వైకుంఠ ద్వారం ద్వారా 88,662 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. హుండీ ద్వారా భారీగా ఆదాయం వచ్చిందని, రూ.5.05 కోట్లు సమకూరిందని అధికారులు తెలిపారు. అలాగే, 24,417 మంది భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటూ తలనీలాలు సమర్పించారు. ఆదివారం సాయంత్రం నాటికి కూడా 50 వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు.భక్తుల సౌకర్యార్థం, టీటీడీ అధికారులు రద్దీని అంచనా వేస్తూ, అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటున్నారు. సర్వదర్శనం చేసుకునే భక్తులకు కూడా త్వరగా దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి, వీఐపీ దర్శనాలకు పరిమిత సంఖ్యలో భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ంఎ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా, సర్వదర్శనం చేసుకునే భక్తులకు కూడా దర్శన సమయాన్ని తగ్గించగలిగారు. క్యూలైన్‌లో ప్రవేశించిన 12 గంటల్లోపే దర్శనం కల్పించడం అనేది భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా మారింది. ఈ నెల 8వ తేదీ వరకు ఇదే పద్ధతిలో భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడానికి అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారని అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు.తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరో రోజు, అధ్యయనోత్సవంలో 17వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు పల్లకి ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరఫున జియ్యంగార్లు పూలచెండ్లను స్వామివారిపై మూడుసార్లు విసిరి వేసారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు.అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నిందాస్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.ప్రణయ కలహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. మరోవైపు ఆరో రోజు వైకుంఠ ద్వార దర్శనాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయని చెప్పారు. 'ముఖ్యంగా ఐదోరోజు శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం కల్పించాము. ఇందులో సర్వ దర్శనానికి విచ్చేసిన సామాన్య భక్తులకు ఏఐ టెక్నాలజీ సాయంతో క్యూలైన్లలోకి ప్రవేశించిన 12 గంటల్లోపే దర్శనం చేయించాము. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు క్యూలైన్ల నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. జనవరి 8వ తేది వరకు ఇదేవిధంగా భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులందరూ సమిష్టి కృషి చేస్తున్నాము' అని తెలిపారు.

# కమలం గూటికి ఆ ముగ్గురు...

శ్రీకాకుళం, జనవరి 5, శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఎవరికీ అంతు పట్టవు. అధికార ప్రతిపక్ష పార్టీల్లో విభేదాలు ఉన్నాయి. అధికార పార్టీలో కోల్డ్ వార్ సాగుతుండగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాత్రం ప్రత్యక్షంగానే విభేదాలు ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఓటమితో ఇప్పుడు బయట పడుతున్నాయి. ఆమదాలవలస లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇన్చార్జి బాధ్యతలనుంచి తప్పించారు. ఆయన స్థానంలో ద్వితీయ శ్రేణి నాయకుడు చింతాడ రవికుమార్ కు బాధ్యతలు కట్టబెట్టారు.



కుటుంబ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాసును పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయలక్ష్మిని త్వరలో తప్పిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే వైసీపీ నుంచి నిరాదరణకు గురైన నేతలు ఇప్పుడు వేరే పార్టీలో చేరలేకపోతున్నారు. ఎందుకంటే కూటమి పార్టీల నుంచి వారికి ఆహ్వానం లేదువచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారాంకు టికెట్ దక్కదన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో ఆయన పునరాలోచనలో పడ్డారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు సీతారాం. కానీ ప్రజారాజ్యం పార్టీలో చేరి తర్వాత టిడిపిలోకి వచ్చారు. తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. గత మూడుసార్లు పోటీ చేసి ఒకసారి మాత్రమే గెలిచారు. అందుకే జగన్మోహన్ రెడ్డి పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ ఉంది. అయితే ఆయన టిడిపిలోకి వచ్చే ఛాన్స్ లేదు. జనసేన లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వర్కౌట్ కాలేదు. అయితే ఇప్పుడు బిజెపిలోకి వెళ్తారన్న ప్రచారం పతాక స్థాయిలో ఉంది.జగన్మోహన్ రెడ్డి చాలామందికి అవకాశాలు ఇచ్చారు. అలా అవకాశాలు కల్పించిన నేతల్లో దువ్వాడ శ్రీనివాసు ఒకరు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన దువ్వాడ శ్రీనివాస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిన వెంటనే ఆయన వెంట అడుగులు వేశారు. అందుకే దువ్వాడ శ్రీనివాస్ కు ఒకసారి ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారు జగన్మోహన్ రెడ్డి. మూడుసార్లు ఆయన ఓడిపోయారు. అయితే ఎమ్మెల్సీ ని చేసి చట్టసభలకు పంపించారు జగన్. అయితే ఇప్పుడు వ్యక్తిగత కుటుంబ వివాదాలతో పార్టీ వేటు వేసింది. తిరిగి ఆయన చేరిక కష్టమేనని తేలిపోయింది. దీంతో ఆయన సైతం బిజెపిలో చేరుతారని ప్రచారం నడుస్తోంది. ఎందుకంటే టిడిపి తో పాటు జనసేనలో ఆయనకు అవకాశం లేనట్టే.ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయలక్ష్మి ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆమె వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆమె భర్త పిరియా సాయిరాజ్ పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయితే మరోసారి ఆమెకు చాన్స్ లేదని తెలుస్తోంది. త్వరలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి కొత్త సమన్వయకర్త వస్తారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే పిరియా విజయలక్ష్మి సైతం బిజెపిలో చేరడం ఖాయమని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. అయితే బిజెపి హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అన్నది చూడాలి. ఎందుకంటే ఇక్కడ తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com